క్లుప్తంగా

30 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్ కిట్ పంపిణీ



కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లు చికిరేణిగుంటకు చెందిన 30 గిరిజన కుటుంబాలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్‌తో సహా సిలిండర్, స్టవ్, పైపులను ఉచితంగా పంపిణీ చేశారు. వీటిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత చక్కా మనోహర్ బాబు చేతుల మీదుగా సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పైసా ఖర్చు లేకుండా పీఎంయూవై కింద గ్యాస్ కనెక్షన్‌తో సహా సిలిండర్, స్టవ్, పైపులను ఉచితంగా పొందే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆమవరపు సింధు, ఎంపీటీసీ సభ్యులు నంబూరి ప్రసాద్, పార్టీ నేతలు వేముల వెంకటేశ్వర్లు, నవీన్, బొర్రయ్య, రమణయ్య, బి.సునీల్ ఎ.శ్రీనివాసులు, కె.శ్రీహరి, వార్డు సభ్యురాలు తిరుపతమ్మ పాల్గొన్నారు.

కోవూరు సీఐగా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావు

కోవూరు : కోవూరు సీఐగా దాసరి వెంకటేశ్వరరావును నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో కోవూరులో ఎస్సైగా పనిచేస్తూ సీఐగా పదోన్నతిపై వెళ్లారు. కొంతకాలం సీసీఎస్ సీఐగా పనిచేస్తూ తిరిగి కోవూరు సీఐగా నియమితులయ్యారు. త్వరలోనే కోవూరు బాధ్యతలు చేపట్టనున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ఎట్టి పరిస్థితుల్లో అభివృద్ధి పనులు ఆగేందుకు వీలులేదని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో తోడేరులో మంత్రి కాకాణి సోమవారం సమీక్ష నిర్వహించారు. త్వరలో అసైన్మెంట్ పట్టాలను పేదలకు అందజేస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆరాతీశారు. తోడేరు గ్రామంలో జరుగుతున్న పనులను వెంటనే పూర్తి చేయాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. వీటిని పరిశీలించి ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈ సమీక్షలో హౌసింగ్ ఏఈ శివమోహన్, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, ఏడీఏ శివనాయక్, ఏఓ వాసు, ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాసులురెడ్డి, అనిల్‌కుమార్, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, ఏపీఎం రోజ్‌మేరీ, వైద్యాధికారులు నరసింహారావు, కావ్యశ్రీ, కిరణ్‌రిషిత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం

నెల్లూరు (దర్గామిట్ట): 2014 జూన్ 2 నాటికి ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులరైజేషన్ చేస్తూ జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చి కాంట్రాక్ట్ లెక్చరర్స్ కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. ఐదేళ్ల సడలింపునకు కృషి చేసి మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇనపకుతిక సునీల్‌శర్మ, సాయికిరణ్, కోటేశ్వరరావు, కిరణ్‌రెడ్డి, గౌతమ్, విజయరాజు పాల్గొన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

నెల్లూరు(టౌన్): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న చేపడుతున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో సోమవారం విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది విద్యార్థి, యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కు కోసం కార్మికులు, ప్రజాసంఘాలు చేపడుతున్న ఆందోళనలు ఈ నెల 8వ తేదీ నాటికి వేయి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష సంఘాలు విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు.

జిల్లాలో ఆదర్శ గ్రామంగా తోడేరు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎంపీఎఫ్‌సీ గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : జిల్లాలోనే ఆదర్శంగా తన స్వగ్రామం తోడేరులో అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తోడేరులో రూ.62.50 లక్షలతో పూర్తి చేసిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, సైడ్‌డ్రెయిన్లను మంత్రి సోమవారం ప్రారంభించారు. రూ.82 లక్షలతో వెయ్యిమెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ జన్మనిచ్చిన గ్రామానికి ఎంతచేసినా రుణం తీర్చుకోలేనన్నారు. తన కుటుంబం ఉన్నతంగా ఉండాలని గ్రామస్తులు తమ వెంట నడిచినట్లు భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి 18 ఏళ్ల సమితి ప్రెసిడెంట్‌గా పనిచేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తాను జెడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా రూ.11 కోట్ల మేర అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. ఇక్కడ పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తే నూరు శాతం సౌకర్యాల కల్పన జరిగినట్లు అవుతుందని చెప్పారు. నవంబరు 15న గ్రామానికి చెందిన 124 మందికి అసైన్మెంట్ భూముల పట్టాలను అందజేస్తామన్నారు.

అభివృద్ధిని అడ్డుకోలేరు

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని టీడీపీ నేత సోమిరెడ్డి అడ్డుకోలేడని మంత్రి కాకాణి అన్నారు. తన సొంత గ్రామం తోడేరులో తనకు వ్యతిరేకత ఉందని గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయాలు చేయాలని చూశాడని పేర్కొన్నారు. అయితే గ్రామంలో సోమిరెడ్డి నడిచిన ప్రాంతాన్ని పసుపునీటితో శుద్ధి చేస్తే తోకముడిచి పారిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. సొంత నియోజకవర్గం నుంచి తానొక్కడినే మంత్రినై ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కలిగినట్లు వెల్లడించారు. తొలుత గ్రామస్తులు, విద్యార్థులు మంత్రి కాకాణికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీఓ సుధాభారతి, మార్కెటింగ్ ఏడీ అనితాకుమారి, తహసీల్దార్ కె.వీరవసంతరావు, వైద్యాధికారి డాక్టర్ రమేష్, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్, సర్పంచ్ అలుపూరు పెంచలమ్మ, ఎంపీటీసీ సుగుణమ్మ, పార్టీ నేతలు ఏనుగు శశిధర్‌రెడ్డి, అట్ల రవీంద్ర, ఎం.శ్రీనివాసులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

• కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రసన్న దిశానిర్దేశం

కోవూరు : 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని పార్టీ క్యాడర్ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. నెల్లూరులోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ నాయకులు నిర్వహించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 9వ తేదీ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్‌లు కార్యక్రమంలో పాల్గొని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు తెలియజేశామని గుర్తుచేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, మండల కన్వీనర్‌లు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేత

మనుబోలు : బద్వేలు–కృష్ణపట్నం పోర్టు హైవే నిర్మాణానికి భూసేకరణ కింద తీసుకున్న పొన్నూరమ్మ దేవాలయానికి సంబంధించిన భూమికి పరిహారం ఇప్పించాలని వడ్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఈగా సురేష్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ శివకృష్ణయ్యను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వడ్లపూడి గ్రామంలో ఉన్న గ్రామదేవత పొన్నూరమ్మ దేవాలయానికి సంబంధించిన 12 సెంట్ల భూమిని బద్వేలు– కృష్ణపట్నం పోర్టు జాతీయ రహదారి నిర్మాణం కోసం తీసుకున్నారని తెలిపారు. అందుకు సంబంధించి రూ.2.64 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉందని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఇంత వరకూ పరిహారం చెల్లించలేదన్నారు. వెంటనే పరిహారం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ శివకృష్ణయ్య స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం మంజూరు చేయిస్తానని తెలిపారు.

సర్వేపల్లిలో గ్రావెల్ రోడ్లకు రూ.6.21 కోట్లు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాలకు మార్కెటింగ్ శాఖ ద్వారా గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.6.21 కోట్లు మంజూరు చేసినట్లు మార్కెటింగ్ శాఖ డీఈ నారాయణరావు వెల్లడించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పొదలకూరు మండలంలో 70 రోడ్ల నిర్మాణానికి రూ.1.98 కోట్లు, ముత్తుకూరులో 21 రోడ్లకు రూ.75 లక్షలు, మనుబోలులో 40 రోడ్లకు రూ.1.50 కోట్లు, టీపీ గూడూరులో 34 రోడ్లకు రూ.96 లక్షలు, వెంకటాచలంలో 34 రోడ్ల నిర్మాణానికి రూ.1.02 కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. రైతులకు ఉపయోగపడేలా గ్రావెల్ రోడ్లను గుర్తించి అంచనాలు రూపొందించామన్నారు. త్వరలో పనులను మొదలు పెడుతామన్నారు.

మాయమాటలతో చైన్లు కొట్టేసిన పీఈటీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్‌లో రామ్‌భూపాల్‌రెడ్డి అనే పీఈటీ ఇద్దరు చిన్నారులకు మాయమాటలు చెప్పి రెండు బంగారు చైన్‌లను అపహరించాడు. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళెంలోని వివేకానంద స్కూల్‌లో రామ్‌భూపాల్‌రెడ్డి పీఈటీగా పనిచేస్తున్నాడు. అదే స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులతో (ఒకరికి తెలియకుండా మరో విద్యార్థికి) మాయమాటలు చెప్పి రెండు బంగారు చైన్‌లను తీసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన చిన్నారులను వారి తల్లిదండ్రులు బంగారు చైన్ల విషయమై అడగ్గా పీఈటీ మాస్టార్‌కు ఇచ్చామని తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పీఈటీ మాస్టర్‌కు కాల్ చేయగా ఫోన్ స్విచాఫ్ వచ్చింది. అనుమానంతో స్కూల్ వద్దకు వెళ్లి కరస్పాండెంట్ సుబ్బారెడ్డిని కలిసి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అనంతరం పీఈటీ మాస్టర్ ఇంటి వద్దకు తల్లిదండ్రులు వెళ్లగా అప్పటికే రామ్‌భూపాల్‌రెడ్డి చైన్లతో పరారైన విషయం తెలిసిందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ విషయమై బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో మాజీ సర్పంచ్ రాయసం వెంకటేశ్వరరావు కాంస్య విగ్రహావిష్కరణ మంగళవారం ఉదయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరు కానున్నారని తెలియజేశారు.

ఘనంగా ధర్మప్రచార యాత్ర



ధర్మప్రచార యాత్ర నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మప్రచార యాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ప్రతిమలతో ధర్మ ప్రచార యాత్ర చేశారు. అనంతరం సుదర్శన హోమం, కుంకుమార్చన, స్వామి, అమ్మవార్ల కల్యాణ ఘట్టాలను వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో భారీ వర్షం



ముత్తుకూరులో జోరుగా కురుస్తున్న వర్షం

ముత్తుకూరు : సముద్రతీర ప్రాంతమైన ముత్తుకూరులో సోమవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు మండల కేంద్రంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రధాన వీధులు నిర్మానుష్యమయ్యాయి. ఈ వర్షం వల్ల దినసరి కూలీలు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టాలంటే ఇంకా వర్షాలు కురవాలని రైతులు తెలియజేస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



బీఎల్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ పద్మజ

కోవూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఓటు హక్కుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బూత్‌లెవల్ అధికారి వారివారి పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారి ఓటు తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తప్పక పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా బీఎల్వోల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ సుధా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

19న గాండ్ల, తెలికుల శంఖారావ మహాసభ

నెల్లూరు(బారకాసు): ఈ నెల 19న రాజమండ్రిలో అఖిల గాండ్ల తెలికుల శంఖారావ మహాసభ నిర్వహించనున్నట్లు అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం తెలిపారు. శనివారం ఆయన నెల్లూరులో సంఘ రాష్ట్రాధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు, గౌరవ సలహాదారుడు ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు హరగోపాల్‌ను కలుసుకుని శంఖారావ మహాసభకు రావాలని ఆహ్వానించారు. అనంతరం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరవ అనంతం మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి కులగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో గాండ్ల, తెలికుల, తదితర కులాలకు సంబంధించి నెలకొన్న గందరగోళంపై వారిని చైతన్యపరిచేందుకు శంఖారావ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గాండ్ల సామాజిక వర్గీయులందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, గోపాలకృష్ణ, వెంకట్రావు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

నెల్లూరు(బారకాసు): రోడ్డుపై అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని బీవీనగర్‌కు చెందిన హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు స్థానికులు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము బీవీనగర్లోని సంఘమిత్ర స్కూల్ వీధిలో నివసిస్తున్నామని తెలిపారు. తమ ఇంటి హద్దుకు పడమరవైపు ఉన్న రోడ్డులో అక్రమంగా కట్టడాలు ఉన్నాయని, ప్రస్తుతం ఇంకా కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారని విన్నవించారు. అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నమ్మకంతో పార్టీలోకి వస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతోపు పంచాయతీ ఆంజనేయపురం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీని వీడి నెల్లూరులోని మంత్రి కాకాణి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో తెలుగుదేశం పార్టీ దిగజారిపోతోందన్నారు. టీడీపీ నేత సోమిరెడ్డికి ఇక్కడ డిపాజిట్ దక్కే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ నేతలు తలమంచి సురేంద్రబాబు, లేబూరు మల్లికార్జున్, వీరరాఘవులు, లేబూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాలలో ఉన్న ఆశాదీప్ అనాథాశ్రమంలో వృద్ధులు, చిన్నారులకు సోమవారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ఇజ్రాయెల్ మాట్లాడుతూ తన కుమార్తె రాణి ఇవాంజిలి పుట్టినరోజు సందర్భంగా అల్పాహారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకుడు శేషాద్రి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాదయాత్ర చరిత్రాత్మకం



పొదలకూరు : కేక్ కట్ చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కోవూరు : కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర చరిత్రాత్మకమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా తోడేరులోని కాకాణి స్వగృహంలో నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్ర సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలోకి 2018 జనవరి 31వ తేదీన ప్రవేశించినట్లు చెప్పారు. మూడురోజుల పాటు నియోజకవర్గంలో పాదయాత్ర అద్భుతంగా సాగినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ పెంచలమ్మ, ఎంపీటీసీలు సుగుణ, జి.శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు వి.గోపాల్‌రెడ్డి, ఎ.శశిధర్ రెడ్డి, ఎం.రమణారెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, అంజాద్, భారతమ్మ, శివశంకర్ పాల్గొన్నారు.

సంబరాల్లో పార్టీ నేతలు

కోవూరు : ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినట్లు గుర్తుచేశారు. ఆయన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పార్టీ నేతలు సురేష్, వెంకటరమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రసాద్, నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీహరి పాల్గొన్నారు.